# కార్మికవర్గం-రైతాంగం

లెనిన్

*(భారత సమాజ పురోగమనానికి ప్రధాన ఆటంకాలుగా వున్న భూస్వామ్య విధానం, సామ్రాజ్యవాదం, దళారీ పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో సమాజంలో ప్రధానశక్తిగా వున్న రైతాంగంతో ఐక్యత సాధించకుండా కార్మికవర్గం విజయం సాధించలేదు. 1905 నవంబర్‌లో కార్మికవర్గం-రైతాంగం' అన్న తన వ్యాసంలో కామ్రేడ్ లెనిన్ ఈ అంశాన్ని సైద్ధాంతికంగా విశ్లేషించారు. సోషలిజం కోసం పోరాటంలో కార్మికవర్గ నాయకత్వం ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసుకోవలసిన అవసరాన్నీ, అందుకు ముఖ్యమైన కార్మిక-రైతాంగ మైత్రిని సాధించటం ద్వారానే పురోగమించగలుగుతుందనీ పేర్కొన్నారు. - **సంపాదకులు**)*

**ఇప్పుడు** మాస్కోలో జరుగుతున్న రైతాంగ సంఘ మహాసభ ఒక ముఖ్య సమస్యను మన ముందుంచింది. రైతాంగ ఉద్యమం పట్ల సోషల్ డెమోక్రాట్ల వైఖరి ఏమిటి? కార్యక్రమాన్నీ, ఎత్తుగడలనూ నిర్వచించుకుంటున్న రష్యా మార్క్సిస్టులకు ఈ ప్రశ్న కీలకమైనదిగా వుంటూ వచ్చింది. రష్యా సోషల్ డెమోక్రాట్ల కార్యక్రమపు మొదటి ముసాయిదా (దీనిని 1884లో కార్మిక విమోచన గ్రూపు విదేశంలో ప్రచురించింది) రైతాంగ సమస్యను కీలకాంశంగా చర్చించింది.

ఆనాటి నుండీ నిర్దిష్టమైన మార్క్సిస్టు వైఖరులనూ, నినాదాలనూ అభివృద్ధి చేసి, అన్వయించని సోషల్ డెమోక్రాటిక్ పత్రికగానీ, సాధారణ సమస్యలను చర్చించిన మార్క్సిస్టు రచన గానీ లేదు.

సైద్ధాంతికంగానే కాకుండా, ప్రత్యక్ష కార్యాచరణ రీత్యా కూడా రైతాంగ ఉద్యమం నేడు అత్యంత జరూరు సమస్యగా వుంది. మన సాధారణ నినాదాలను విప్లవకర రైతాంగానికి విప్లవకర కార్మిక వర్గమిచ్చే పిలుపులుగా మలచాల్సి వుంది. రష్యాలో నూతన జీవన విధాన రూపకర్తగా చైతన్యంతో రైతాంగం ముందుకు వస్తున్న సమయం వచ్చింది. రష్యా విప్లవ క్రమమూ, ఫలితమూ కూడా రైతాంగపు చైతన్యం అభివృద్ధి చెందటంపై అపారంగా ఆధారపడి వుంది.

విప్లవాన్నుండి రైతాంగం కోరుకుంటున్నదేమిటి? రైతాంగానికి విప్లవమిచ్చేదేమిటి? రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నమైవున్న ప్రతి ఒక్కరూ, ప్రత్యేకించి బూర్జువా రాజకీయ వేత్తలు వక్రీకరించిన అర్థంలోగాక, దాని సరైన అర్థంలో రాజకీయాలు నడిపే వర్గ చైతన్యపూరిత కార్మికుడు ఈ రెండు ప్రశ్నలకూ సమాధానం చెప్పాలి.

రైతాంగం భూమినీ, స్వేచ్ఛనూ కోరుతున్నారు. దీనిపై మరో అభిప్రాయమంటూ లేదు. విప్లవకర రైతాంగానికి వర్గ చైతన్యం గల కార్మికులందరూ తమ పూర్తి మద్దతునిస్తారు. రైతాంగానికి భూమంతా చెందాలనీ, వారు పూర్తి స్వేచ్ఛ పొందాలనీ వర్గ చైతన్యంగల కార్మికులందరూ కోరుకుంటున్నారు; దానికోసమే పని చేస్తున్నారు. మొత్తం భూమి రైతాంగానికి చెందాలని డిమాండు చేయటమంటే పాక్షిక రాయితీలూ, దానానికి సంతృప్తి పడటం కాదు; రైతాంగానికీ, భూస్వాముల మధ్య రాజీ కొరకు కృషి చేయటం కాదు; భూఎస్టేట్ల రద్దు కొరకు కృషి చేయటం. వర్గ చైతన్యపూరిత కార్మికవర్గ పార్టీ అయిన సోషల్ డెమోక్రాట్లు ఈ వైఖరినీ ఉద్ఘాటించారు. ప్రైవేటు యాజమాన్యంలో వున్న భూములన్నింటినీ **స్వాధీనపరచుకోవటంతో సహా,** రైతాంగ విప్లవకర డిమాండ్లన్నింటికీ ఈ ఏడాది మే నెలలో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి మూడవ మహాసభ మద్దతు తెలుపుతూ తీర్మానం ఆమోదించింది. వర్గచైతన్యం గల కార్మికుల పార్టీ భూమి కావాలన్న రైతాంగపు డిమాండుకు మద్దతు తెలిపినట్లు ఈ తీర్మానం స్పష్టం చేసింది.

“పూర్తి స్వేచ్ఛ” అంటే అర్థం ప్రజా, రాజ్య వ్యవహారాలను పాలించే అధికారులనూ, ప్రతినిధులనూ ఎన్నుకోవటం. “పూర్తి స్వేచ్ఛ” అంటే అర్థం పూర్తిగా ప్రజలపై ఆధారపడని, ప్రజలచే ఎన్నుకోబడని, ప్రజలకు బాధ్యత వహించని, మార్చివేసే అధికారం ప్రజలకు లేని రాజ్య వ్యవస్థను పూర్తిగా రద్దు చేయటం. “పూర్తి స్వేచ్ఛ” అంటే అర్థం అధికారులకు ప్రజలు లొంగివుండటం కాదు; ప్రజలకు అధికారులు లొంగివుండటం.

అయితే భూమి కొరకూ, స్వేచ్ఛ కొరకూ పోరాడుతున్న రైతాంగమంతా తమ పోరాట ప్రాధాన్యతను పూర్తిగా అర్థం చేసుకోలేదు; రిపబ్లిక్కును డిమాండు చేసే స్థాయికి చేరుకోలేదు. అయితే రైతాంగపు డిమాండ్లలో ప్రజాస్వామిక ధోరణి వుందన్నది నిస్సందేహం. కనుక కార్మికవర్గం తన డిమాండ్లను సమర్థిస్తుందని విశ్వసిస్తుంది. నగరాలలో ఎగురుతున్న ఎర్రజండా పారిశ్రామిక, గ్రామీణ శ్రామికుల తక్షణ, కీలక డిమాండ్ల పోరాట జెండా మాత్రమే కాదనీ, భూమిని దున్నే లక్షలాది రైతాంగపు డిమాండ్ల కొరకు కూడా నిలుస్తుందని రైతాంగం తెలుసుకోవాలి.

అవకాశమున్న అన్ని రూపాలలో వున్న అర్ధ బానిస వ్యవస్థ, అవశేషాలు రైతాంగ జనావళిని నిర్దాక్షిణ్యంగా అణచివేతకు గురి చేస్తున్నాయి. ఎర్రజండా నీడలో కార్మికవర్గం ఈ అణచివేతపై యుద్ధాన్ని ప్రకటించింది.

అయితే రైతాంగపు డిమాండ్లకు కార్మిక వర్గపు మద్దతుకే ఎర్రజండా పరిమితం కాబోదు. అది కార్మిక వర్గపు స్వతంత్ర డిమాండ్ల కొరకు కూడా నిలుస్తుంది. అది భూమి కొరకు, స్వేచ్ఛ

కొరకు పోరాటపు పక్షాన నిలవటమే కాదు మనిషిని మరో మనిషి చేసే దోపిడీకి ప్రజల దారిద్ర్యానికీ పెట్టుబడి పాలనకూ వ్యతిరేక పోరాటపు పక్షాన కూడా నిలుస్తుంది.

ఇక్కడే మనకు రెండవ ప్రశ్న ఎదురౌతుంది. రైతాంగానికి విప్లవమేమిస్తుంది? రైతాంగం పట్ల నిజాయితీతో కూడిన స్నేహితులు (ఉదాహరణకు సోషలిస్టు విప్లవకారులు) ఈ ప్రశ్నను ఉపేక్షిస్తున్నారు; దాని ప్రాధాన్యతను గుర్తించటం లేదు. రైతాంగం కోరుకుంటున్న భూమి, స్వేచ్ఛ సమస్యలను లేవనెత్తి పరిష్కరిస్తే సరిపోతుందని వారు భావిస్తున్నారు. ఇది చాలా పెద్ద పొరపాటు. క్రింది నుండి అత్యున్నత స్థాయి వరకూ అధికారుల ఎన్నిక అన్న పూర్తి స్వేచ్ఛ పెట్టుబడి పాలనను అంతమొందించదు, కొద్ది మంది సంపదను రద్దు చేయదు; ప్రజల దారిద్ర్యాన్ని పోగొట్టదు. భూమిలో ప్రైవేటు యాజమాన్యపు పూర్తి రద్దు కూడా పెట్టుబడి పాలనను గానీ, ప్రజారాశుల దారిద్ర్యాన్ని గానీ అంతమొందించదు. జాతిపరం చేసిన భూమిలో కూడా స్వంత పెట్టుబడి వున్నవారే, సాగు సాధనాలు సాగు పశువులు, యంత్రాలు, విత్తనాలు, వున్నవారే సాగు చేయగలుగుతారు. తమ చేతులు తప్ప ఏమీ లేని వారు భూమి జాతికి చెందినప్పటికీ ప్రజాస్వామిక రిపబ్లిక్కులో కూడా అనివార్యంగా పెట్టుబడికి బానిసలుగానే వుండిపోతారు. పెట్టుబడిని సామాజీకరించకుండా భూమిని "సామాజీకరించే" భావం, పెట్టుబడీ, సరుకుల ఆర్థికం వుండగానే భూమి వినియోగంలో సమానత్వం తేగలమన్న భావం పగటికలగానే వుంటుంది. సోషలిజంలో ఈ భ్రమలు ప్రబలిన కాలం యూరోపు దేశాలన్నిటా వుంది. ఈ భ్రమ ఎంత ప్రమాదకరమో అన్నిదేశాల కార్మికవర్గ పోరాటాల అనుభవం ఆచరణలో నిరూపించింది. యూరోపు, అమెరికాలలోని సోషలిస్టు కార్మికవర్గం ఈ భ్రమలను పూర్తిగా వదిలించుకుంది.

కనుక వర్గచైతన్యపూరిత కార్మికుల ఎర్రజెండా మొదట భూమి కోసం సంపూర్ణ స్వేచ్ఛ కోసం రైతాంగ పోరాటానికి అన్ని విధాలా మద్దతునిస్తుంది. తర్వాత అక్కడితో ఆగకుండా ముందుకు పోతుంది. భూమి కోసం, సంపూర్ణ స్వేచ్ఛ కోసం పోరాటంతో పాటుగా మనం సోషలిజం కోసం పోరాడుతున్నాము. సోషలిజం కోసం పోరాటమంటే పెట్టుబడి పాలనకు వ్యతిరేకంగా పోరాడటం. ప్రత్యక్షంగానూ, పూర్తిగానూ పెట్టుబడి పరాధీనులైన వేతన కార్మికులు ఈ పోరాటాన్ని ప్రధానంగా సాగిస్తారు. చిన్న ఆస్తిపరులకు సంబంధించి, వారిలో కొందరు స్వంత పెట్టుబడి కలిగి వుంటారు; తరచుగా కార్మికులను దోచుకుంటారు. కనుక సోషలిజం పక్షానికి, ప్రైవేటు ఆస్తికి వ్యతిరేకంగా ప్రజాఆస్తి పక్షానికి చైతన్యంతో నిశ్చయాత్మకంగా వచ్చిన వారు మాత్రమే దీనిలో చేయగలరు.

కనుకనే భూస్వాములకు, అధికారులకు వ్యతిరేకంగా మొత్తంగా రైతాంగం కలిసి పోరాడుతూనే, పట్టణ, గ్రామీణ శ్రామికులతో కలసి పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని సోషల్ డెమోక్రాట్లు చెబుతున్నారు. భూమి కోసం, స్వేచ్ఛ కోసం పోరాటం ప్రజాస్వామిక పోరాటం. పెట్టుబడి పాలన రద్దు కొరకు సాగే పోరాటం సోషలిస్టు పోరాటం.

సంపూర్ణ స్వేచ్ఛ, భూమి కొరకు కృతనిశ్చయంతో, నిస్వార్థంగా పోరాడాలని నిర్ణయించుకున్న రైతాంగ సంఘానికి అభినందనలు తెలియజేద్దాం. ఈ రైతాంగం నిజమైన ప్రజాస్వామికవాదులు, ప్రజాస్వామ్యం, సోషలిజాల పట్ల వారి భావాలలో పొరపాటు ఎక్కడుందో వారికి ఓపికతో వదలకుండా వివరిద్దాం. ఒక సమష్టి పోరాటంలో ఐక్యమైన మిత్రులుగా వారిని పరిగణిద్దాం. ఈ రైతాంగం నిజమైన విప్లవకర ప్రజాస్వామికవాదులు, వారితో కలిసి మనం ప్రస్తుత విప్లవ విజయానికై పోరాడుదాం. సార్వత్రిక సమ్మె పథకానికీ, పట్టణ కార్మికులూ, రైతాంగమూ కలసి పోరాడాలన్న నిర్ణయానికి మద్దతు తెలుపుదాం. విప్లవకర ప్రజాస్వామికవాదులలో ఎంత ఐక్యత సాధించినా, మరింత ముఖ్యమైన సోషలిజం కోసం పెట్టుబడి పాలన రద్దు కోసం, మానవాళి విముక్తి కోసం పోరాడాల్సిన లక్ష్యాన్ని కార్మికులు మరువరాదు. భూమి కోసం, సంపూర్ణ స్వేచ్ఛ కోసం కార్మికులూ, రైతాంగం ముందుకు సాగండి! అంతర్జాతీయ సోషల్ డెమోక్రసీతో ఐక్యమై, సోషలిజం కొరకు పోరాటంలో కార్మికులారా ముందుకు సాగండి!

**నవంబరు 12, 1905, సంపుటి: 10,**
**పేజీ 22-25**

★★★★★